పడకేసిన పంపులు.!

- 10ఎంజీడీ వాటర్ ప్రాజెక్టు నిర్వహణలో నిర్లక్ష్యం
- పంపులు 16.. పని చేస్తున్నవి 6
- స్టాండ్‌బై లేకపోయినా పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా ఉన్న పంపులు



ఎంజీడీ వాటర్ క్లారిఫ్లోక్యులేటర్

గాజువాక: గాజువాక 10 ఎంజీడీ వాటర్ ప్రాజెక్టులో పంపులు పడకేశాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన 16 పంపుల్లో ప్రస్తుతం ఆరే పని చేస్తున్నాయి. మిగిలిన పది పంపులు మరమ్మతుల కోసం ఎదురు చూస్తున్నాయి. ఇందు కోసం నిధులు మంజూరు కాకపోవడంతో ఇక్కడి సిబ్బంది చేతులెత్తేసే పరిస్థితి నెలకొంది.

గాజువాకలోని పది వార్డుల్లో నీటి సరఫరా కోసం గోదావరి 10 ఎంజీడీ వాటర్ ప్రాజెక్టును 2012లో ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రస్తుతం 11,760 బీపీఎల్ కుళాయిలు, 16,152 జనరల్ కుళాయిలు, 295 సెమీ బల్క్ కనెక్షన్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు కోసం అప్పట్లో 16 పంపులను, 12 వాటర్ బెడ్లను నిర్మించారు. పంపులు మరమ్మతులకు గురై ఏళ్ల గడుస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల క్రితం వరకు నాలుగు పంపులు మాత్రమే పని చేసేవి. ఇటీవల మరో రెండు పంపులకు మరమ్మతులు నిర్వహించి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇంకా పది పంపులు నిరుపయోగంగా పడి ఉన్నాయి. తగినన్ని నిధులు మంజూరు చేయకపోవడంతో మరమ్మతులకు కూడా నోచుకోని పరిస్థితి చోటు చేసుకుందని సిబ్బంది చెబుతున్నారు. చాలా మోటార్లకు విడి పరికరాలు అమర్చితే అందుబాటులోకి వస్తాయని అంటున్నారు.

నిర్వహణలోనూ నిర్లక్ష్యం

10 ఎంజీడీ వాటర్ ప్రాజెక్టును 2012లో ప్రారంభించిన అధికారులు నిర్వహణను మాత్రం గాలికొదిలేశారు. ఫలితంగా అందులోని 12 వాటర్ బెడ్లలో ప్రస్తుతం ఆరు మాత్రమే పని చేస్తున్నట్టు సిబ్బంది చెబుతున్నారు. ఇసుక, రాళ్లు లేకపోవడంతో బురదతో నిండిపోయాయి. గేరు బాక్సులు కూడా మరమ్మతుకు గురైనట్టు చెబుతున్నారు. బటర్‌ఫ్లై వాల్వ్‌ల్లో సగం వరకు పని చేయని పరిస్థితి చోటుచేసుకుంది. ఈ కారణంగా నీటి శుద్ధి ప్రక్రియలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెబుతున్నారు.



పని చేయని వాటర్ బెడ్లు

అన్ని పంపులనూ అందుబాటులోకి తెస్తాం

నేను బాధ్యతలు తీసుకున్న తరువాత రెండు పంపులకు మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకొచ్చాం. మిగిలిన వాటిపై కూడా దృష్టి పెడతాం. ఇక్కడ చేపట్టాల్సిన పనులపై ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. త్వరలోనే దీనిపై మాకు ఆదేశాలు వస్తాయి. ప్రస్తుతం నీటి సరఫరాలో గాని, నీటిని శుద్ధి చేయడంలో గాని ఇబ్బంది లేకుండా చూసుకుంటున్నాం.

– కేదార్‌నాథ్, నీటి సరఫరా విభాగం ఏఈ

విద్యా రంగానికి సీఎం జగన్ పెద్ద పీట

- పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- ఇస్లాంపేటలో జూనియర్ కళాశాల భవనం ప్రారంభం



కళాశాల భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెదగంట్యాడ: విద్యా రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. జీవీఎంసీ 77వ వార్డు ఇస్లాంపేటలో రూ.2.18 కోట్లతో కొత్తగా నిర్మించిన జూనియర్ కళాశాల భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో విద్యా రంగాన్ని నిర్వీర్యం చేశారని విమర్శించారు. నాడు–నేడు పథకం కింద పాఠశాలలు రూపురేఖలు మార్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ ప్రాంతంలో ముస్లిం మైనార్టీ విద్యార్థులు ఎక్కువ ఉన్నారని, 10వ తరగతి తరువాత ఎక్కువ శాతం మంది విద్యార్థులు చదువుకు స్వస్తి చెబుతున్నారని, ఇకపై అలా కాకుండా ఇక్కడ జూనియర్ కళాశాల ఏర్పాటు చేశామని వివరించారు. మంచి వాతావరణంలో విద్యా బోధన సాగించనున్నామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ బెన్నస్వామి మాట్లాడుతూ జూనియర్ ఇంటర్ అడ్మిషన్స్ ప్రారంభించామని తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూప్స్ సీట్లను భర్తీ చేస్తున్నామని, ఆసక్తి ఉన్న విద్యార్థులు కళాశాలలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 77వ వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, జోనల్ కమిషనర్ పొందూరి సింహాచలం, ఎంపీ రెడ్డి, శివకుమార్, దావూద్, చిట్టిబాబు, సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా పరిహారం అందజేత



మృతుని కుటుంబ సభ్యులకు తక్షణ సాయం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 88వ వార్డు యాదవ జగ్గరాజుపేటలో ఇటీవల మరణించిన బొట్ట అప్పలనాయుడు కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు అందజేశారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కన్వీనర్ తిప్పల దేవన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ వార్డు ఇన్‌చార్జి మహాలక్ష్మినాయుడు చేతుల మీదుగా మృతుడి కుటుంబ సభ్యులకు ఈ సాయం అందించారు. నెల రోజుల్లో మిగతా పరిహారాన్ని నామిని బ్యాంకు ఖాతాలో జమా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నమ్మి శ్రీనివాస్‌ప్రసాద్, మాడిస అప్పలరాజు, సచివాయల వెల్ఫేర్ బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మజ్జిగ చలివేంద్రాలు ప్రారంభం



ఏ-బ్లాక్‌లో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐలా చైర్మన్ సత్యనారాయణరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్ ఐలా నేతృత్వంలో పలు బ్లాక్‌లలో మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. మంగళవారం రాంనగర్ పారిశ్రామిక ప్రాంతం ఏ-బ్లాక్‌లో మజ్జిగ చలివేంద్రాన్ని ఐలా చైర్మన్ కె.సత్యనారాయణరెడ్డి(రఘు), కోశాధికారి చీకటి సత్యనారాయణ, వాసీవా ఉపాధ్యక్షుడు ఇ.కృష్ణప్రసాద్ ప్రారంభించారు. పెదగంట్యాడ ఆటోనగర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఐలా ఉపాధ్యక్షుడు కొల్లి ఈశ్వరరావు, జీ-బ్లాక్‌లో ఐలా సంయుక్త కార్యదర్శి రామకృష్ణరాజు, కోశాధికారి పద్మ, ఇ-బ్లాక్‌లో చుండూరు విశాలక్ష్మి, ఎఫ్-బ్లాక్‌లో కోటేశ్వరరావు ప్రారంభించారు.

భక్తిశ్రద్ధలతో పైడిమాంబ పండగ



పూజలందుకుంటున్న పైడిమాంబ అమ్మవారు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో కొలువైన పైడిమాంబ అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా జరిగింది. వేకువజామున భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారికి పసుపు, కుంకుమలు, నూతన వస్త్రాలు సమర్పించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద 5 వేల మందికి భారీ అన్నసమారాధన చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త బొడ్డు పైడిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బొడ్డు వెంకటరమణారావు, బొడ్డు శివరాజేష్, బొడ్డు గంగరాజు, బొడ్డు అప్పారావు, డొప్పా చిన్నా పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

కూర్మన్నపాలెం: విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికొస్తున్న ఓ వ్యక్తిని లారీ ఢీకొనడంతో మృతి చెందిన ఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ మేరకు దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జీవీఎంసీ 86వ వార్డు కూర్మన్నపాలెంలోని యాతపాలెంలో నివాసముంటున్న బుద్ద ముత్యాలనాయుడు(55) ఆక్సిజన్ గ్యాస్ సిలిండర్ల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం శ్రీనగర్‌లోని కార్యాలయంలో విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తున్న సమయంలో కూర్మన్నపాలెం జంక్షన్‌లో లారీ ఢీకొంది. తీవ్ర గాయాలు పాలైన ఆయనను దువ్వాడ పోలీసులు హుటాహుటిన గాజువాకలోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే ముత్యాలనాయుడు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడికి భార్య భవానీ, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

వికసించిన బ్రహ్మకమలం



పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు దయాళ్ నగర్‌లో నివాసం ఉంటున్న 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు నివాసంలో సోమవారం అర్ధరాత్రి బ్రహ్మ కమలం వికసించింది. ఇరుగుపొరుగు వారు సైతం ఇంటికొచ్చి ఆ పుష్పాన్ని చూసి ఆనందం వ్యక్తం చేశారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండండి



సచివాలయ మహిళా పోలీసులకు అవగాహన కల్పిస్తున్న గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు

అక్కిరెడ్డిపాలెం: నేరాలపై సచివాలయాల మహిళా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని గాజువాక సీఐ ఎల్.భాస్కరావు సూచించారు. మంగళవారం గాజువాక పోలీస్ స్టేషన్‌లో నియోజకవర్గంలోని సచివాలయాల మహిళా పోలీసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం డ్రగ్స్ వినియోగం ఎక్కువగా ఉన్నందున ప్రతి వార్డులోనూ మహిళా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. వార్డుల్లో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేలా నివాసాలు, వ్యాపార సముదాయాల యజమానులకు అవగాహన కల్పించాలని సూచించారు. వార్డులో జరిగే నేరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ గాజువాక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు కొల్లి సతీష్, టి.రవికుమార్, ఎం.రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు అవగాహన

రహదారి భద్రత, నేరాలపై ఆటో డ్రైవర్లు, ఆటో స్టాండ్ యూనియన్ ప్రతినిధులకు అవగాహన అవసరమని గాజువాక ట్రాఫిక్ సీఐ ఆర్.సత్యనారాయణరెడ్డి, క్రైం సీఐ సూర్యనారాయణ, లా అండ్ ఆర్డర్ సీఐ ఎల్.భాస్కరరావు అన్నారు. ఆటో డ్రైవర్లకు వివిధ రకాల నేరాలు, వాటిని ఎలా అధిగమించాలో, పోలీసులకు ఎలా సహకరించాలో వివరించారు.

అమ్మవార్ల ఆలయాల ప్రారంభోత్సవానికి ఆహ్వానం



ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి

అక్కిరెడ్డిపాలె: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో ఈ నెల 31న జరగనున్న కుంచాలమ్మ, దుర్గాలమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల ఆలయాల పునః స్థిర ప్రతిష్ఠాపన మహోత్సవ ఆహ్వాన పత్రికను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి మంగళవారం కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అందజేశారు. మంగళవారం ఎమ్మెల్యేను కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువజన సేవా సంఘం కార్యదర్శి కొల్లి కుంచారావు, కొల్లి వినోద్‌రెడ్డి, కొల్లి అప్పలరెడ్డి, నావాన సింహాచలం, అగ్గిరాజు, విరోతు వరహాలు పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వ విధానాలు దుర్మార్గం'



రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మిక వర్గాన్ని అణచివేసే కేంద్ర ప్రభుత్వ విధానాలు దుర్మార్గమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 831వ రోజుకు చేరుకున్నాయి, ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకుడు మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు అమ్మాలనే ఆలోచన వచ్చిన మోదీ ప్రభుత్వానికి ప్రజలు గట్టి బుద్ధి చెబుతారన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, ఈ ప్రయత్నాలను కార్మిక వర్గం ఒక తాటిపైకి వచ్చి తిప్పికొట్టాలన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను బడా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలనుకోవడం అన్యాయమన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమంలో ప్రజలందర్నీ భాగస్వాములు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఐసీఐసీఐలో రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టుకు ఇంటర్వ్యూ నేడు

గాజువాక: ఐసీఐసీఐ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టును ఆన్‌రోల్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు ఈ నెల 24న స్థానిక చైతన్య మహిళా డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూ నిర్వహించనున్నారు. 25 ఏళ్లలోపు వయోపరిమితి కలిగిన డిగ్రీ అభ్యర్థులు నేరుగా ఈ ఇంటర్వ్యూకు హాజరు కావచ్చని కళాశాల ప్రిన్సిపాల్ చంద్ర మహాలక్ష్మి తెలిపారు. 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ పోస్టుకు అర్హులని, ఎంపికైన అభ్యర్థులకు రూ.2.60 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వార్షిక వేతనం ఉంటుందని పేర్కొన్నారు. వివరాల కోసం 96766 03446 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కృషి చేయాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణలో కార్మిక వర్గం మమేకం కావాలని ఉక్కు అఖిలపక్ష నాయకులు కోరారు. ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం వివిధ విభాగాల్లో కూడళ్లలో ప్రచారం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ గత రెండున్నరేళ్లుగా ప్లాంట్ పరిరక్షణకు కార్మిక వర్గం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ ముందుకు సాగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక వర్గం మరింత అప్రమత్తంగా ఉంటూ ఉద్యమాన్ని ఉధృతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు కె.ఎస్.ఎన్.రావు, యు.రామస్వామి, నీరుకొండ రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కార్మిక సదస్సుకు జగదీశ్వరరావు



మళ్ల జగదీశ్వరరావు

ఉక్కునగరం: బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మళ్ల జగదీశ్వరరావు జెనీవా అంతర్జాతీయ సదస్సుకు హాజరు కానున్నారు. జూన్ 4 నుంచి 16వ తేదీ వరకు జరగనున్న ఈ సదస్సుకు 191 దేశాల నుంచి కార్మిక మంత్రులు, కార్మిక సంఘాల నాయకులు, ప్రతినిధులు, యాజమాన్యాల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు హాజరు కానున్నారు. ఈ సమావేశాల్లో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కార్మిక సమస్యలపై చర్చలు జరిపి పలు తీర్మానాలు చేయనున్నారు. భారత్ నుంచి బీఎంఎస్ తరపున జగదీశ్వరరావుకు ఆహ్వానం లభించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

బీహెచ్‌ఆర్‌సీ జిల్లా కమిటీ నియామకం



బీహెచ్‌ఆర్‌సీ నూతన కార్యవర్గ సభ్యులు

పెదగంట్యాడ: భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్(బీహెచ్‌ఆర్‌సీ) విశాఖ జిల్లా అధ్యక్షుడిగా వై.శ్రీనివాసరావు నియమితులయ్యారు. బీహెచ్‌ఆర్‌సీ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ పూర్ణచంద్ర సాహు, నేషనల్ వైస్ చైర్మన్ అండ్ ప్రెసిడెంట్ డాక్టర్ పి.నాగేశ్వరరావు కొత్త కమిటీని మంగళవారం నియమించారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డి.రాజేష్, ఉపాధ్యక్షుడిగా మల్లయ్య కుమార్ చటర్జి నియామకమయ్యారు.

మోదీ నిరంకుశ పాలనకు మూల్యం తప్పదు



జీవీఎంసీగాంధీ విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న క్యాబ్ యూనియన నాయకులు

సీతమ్మధార : మోదీ నిరంకుశ పాలనకు మూల్యం చెల్లించక తప్పదని క్యాబ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.శ్రీరాములు హెచ్చరించారు. మంగళవారం అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న దీక్షలు 788వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వంపై ప్రజలకు రోజురోజుకు అసహనం పెరిగిపోతుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాలు ఆపాలని లేని పక్షంలో ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామన్నారు. ప్రభుత్వ సంస్థలను అదానీ, అంబానీలకు అమ్మాలని చూస్తే ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయుడు, గోపీకృష్ణ, అప్పలరాజు,శివ, శ్రీనివాసులు, శ్రీను, ప్రసాద్ పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలకు శ్రీకారం



అగనంపూడి హైస్కూల్‌లో వేసవి శిబిరంలో చిన్నారులతో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి



ఉక్కునగరంలో బాస్కెట్ బాల్ శిక్షణలో బాలబాలికలు



70వ వార్డు శిక్షణా శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ చందు

అగనంపూడి: జీవీఎంసీ సారథ్యంలో 79వ వార్డు శనివాడలోని రియల్ చాంపియన్స్ అకాడమీ పర్యవేక్షణలో ఉచిత కరాటే సమ్మర్ కోచింగ్ క్యాంప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు మాట్లాడుతూ 33 విభాగాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ అప్పికొండ మహాలక్ష్మినాయుడు, సమ్మర్ క్యాంప్ స్పెషల్ ఆఫీసర్ సుబాన్, కోచ్‌లు శివప్రసాద్, మహేష్ పాల్గొన్నారు.

- అలాగే 79వ వార్డు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి రెండు వారాల పాటు శిక్షణ శిబిరం ఉంటుందని తెలిపారు.
- 85వ వార్డు అగనంపూడి జెడ్పీహెచ్ పాఠశాల ఆవరణలో బ్యాడ్మింటన్, టైక్వాండో శిక్షణా శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ప్రతినిధి సింహాచలం, పార్టీ వార్డు యూత్ అధ్యక్షుడు పెదిరెడ్ల హరీష్, దాసరి సత్యవేణి, కోచ్‌లు పాల్గొన్నారు.

ఉక్కునగరం: జీవీఎంసీ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు బిస్కెట్లు, కోడి గుడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జోన్–6 సూపరింటెండెంట్ రమణ, స్టీల్ సీఐటీయూ నాయకులు వై.టి.దాస్, మొహిద్దీన్, రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

గాజువాక: జీవీఎంసీ ఆధ్వర్యంలో 66వ వార్డు బీసీ రోడ్డులో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిబిరాన్ని కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు స్పెషలాఫీసర్ గణపతిరావు, సచివాలయ కార్యదర్శులు కిశోర్, మల్లేష్, లక్ష్మి, కోచ్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

- 70వ వార్డు చట్టివానిపాలెం ప్రభుత్వ పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిబిరాన్ని కార్పొరేటర్ ఉరుకూటి చందు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ బి.వి.రామారావు, ఏఈ సౌజన్య, స్థానిక నాయకులు చట్టం అప్పలరాజు, చట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు.
- 67వ వార్డు గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో వేసవి క్రీడా శిబిరాన్ని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు ప్రసాదుల శంకర్, బొట్ట కోటి, పి.రమణ, ప్రసాదుల అప్పల కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లా పెంటారావు పాల్గొన్నారు.
- 72వ వార్డులోని అమరావతి పార్కు, రాఘవేంద్ర స్కూల్‌లో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిబిరాలను కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్ ప్రారంభించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఏపీడీ రాము, ఎస్‌వో వనజ, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని జోన్–6 కమిషనర్ పొందూరి సింహాచలం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ, తదితరులు పాల్గొన్నారు.



76వ వార్డులో పౌష్టికాహారం అందిస్తున్న జోనల్ కమిషనర్ సింహాచలం, దొడ్డి రమణ

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం



సత్కారం అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెదగంట్యాడ: గ్రామ, వార్డు వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని సచివాలయాల్లో పని చేస్తున్న వలంటీర్లను అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రుణం పేరిట టోకరా

అల్లిపురం: ఫైనాన్స్ కంపెనీలో పనిచేసే వ్యక్తి రుణం ఇప్పిస్తానని చెప్పి తమను మోసగించాడని బాధితులు మంగళవారం టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. వివరాలిలా ఉన్నాయి. డాబాగార్డెన్స్‌కు చెందిన సెల్ ఎలెక్ట్ షోరూంలో రక్షిత్ అనే ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్ తమను మోసగించాడని వి.నరేష్, పత్తి గోవిందరావు తెలిపారు. పత్తి గోవిందరావుకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో రూ.50 వేలు, ఐసీఐసీఐ బ్యాంకులో రూ.50 వేలు, ఐడీఎఫ్‌సీలో రూ.50 వేలు లోన్ ఇప్పిస్తానని చెప్పి లాగిన్ చేశాడు. తర్వాత మీకు సిబిల్ స్కోర్‌లేదు లోన్ రాలేదని చెప్పాడు. కానీ రెండు రోజులుగా బ్యాంకు నుంచి ఫోన్ చేసి లోన్ ఎమౌంట్ కట్టమని ఒత్తిడి చేస్తున్నారని పేర్కొన్నారు. షోరూంకు వెళ్లి అడగ్గా రక్షిత్ పరారయ్యాడని, అతనిపై చాలా కేసులున్నాయని చెప్పడంతో బాధితులు టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు.